జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


బుధవారం | 7-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 560 పేజీలు: 4 వెల : రూ.7

# సంతల్లో.. కోట్లలో దందా!

* వారాంతపు సంతకు పెద్ద ఎత్తున పశువులు
* వ్యాపారులతో దళారుల కుమ్మక్కు
* ఇక్కడి నుంచే కబేళాలకు రాత్రివేళల్లో తరలింపు
* దళారులు, వ్యాపారుల నుంచి కొందరు పోలీసులు, నేతలకు మామూళ్లు

**శ్రీకాకుళం క్రైం, జనవరి 6 (వార్త):** జిల్లాలోని వారాంతపు సంతల నుంచి పెద్ద ఎత్తున పశువులు విజయవాడ, హైదరాబాద్, చెన్నై, తదితర పట్టణాలకు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలిపోతోంది. కొందరు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాల్లో పశువులను కొనుగోలు చేసి వారాంతపు సంతలకు తీసుకువస్తున్నారు. వాటిని దళారులు కొనుగోలు చేసి పశుమాంసం విక్రయిస్తున్న వ్యాపారులకు, కబేళా నిర్వాహకులకు విక్రయిస్తూ కాసులు చేసుకుంటున్నారు. ఆవులు, ఎద్దులు, బర్రెలు, మేకలు, కోళ్లు, గొర్రెలు ఇలా అన్ని రకాల పశువులు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. పండగ సమయం కావడంతో జిల్లాలోని కంచిలి, జలుమూరు, ఆమదాలవలస తదితర మండలాల్లోని వారాంతపు సంత జరుగుతుంది. సంతల్లో కోట్లలో ఈ దందా సాగుతోంది. కొందరు వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ఈ పశువుల రవాణా సాగిస్తున్నారు. వీరికి కొందరు పోలీసులు, రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. వీరికి ప్రతినెలా మామూళ్లు పెద్ద ఎత్తున దళారులు అందిస్తుంటారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పశువులు వ్యాన్లలో తరలిపోతుంటాయి. హైదరాబాద్ నుంచి కొందరు ఇక్కడికి వచ్చి దళారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున పశువులను కొనుగోలు చేస్తుంటారు. పశువుల తరలింపులో ఎటువంటి నిబంధనలు పాటించరు. మూగజీవాలను బంధించి కబేళాలకు తరలిస్తున్నారు. పలుకుబడి ఉన్న వ్యక్తుల అండదండలతో ఈ దందా జరుగుతుం డడంతో ఎవరూ నిలదీయలేకపోతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులకు ఈవిషయం తెలిసినా పెద్ద తలకాయలు ఈ దందాలో ఉండడంతో మనకెందుకులే అన్న ధోరణిలో ఉంటున్నారు. ఆదివారం వేకువజాము రెండు గంటల సమయంలో జమ్ము గ్రామ సమీపంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని జలుమూరు పోలీసులు అడ్డుకున్నారు. నారాయణవలస సంత నుంచి విజయనగరానికి ఓ వాహనంలో తొమ్మిది గేదెలను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇలానే ప్రతిరోజూ అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా సంతల నుంచి వాహనాల్లో పశువులను జిల్లాను దాటించేస్తున్నారు. ఇకనైనా జిల్లా పోలీసు అధికారులు స్పందించి వారాంతపు సంతలపై ఓ కన్నేస్తే ఇక్కడ జరుగుతున్న అక్రమ దందాతో పాటు వెనుకుండి నడిపిస్తున్న వారి బాగోతం బయటపడే అవకాశం ఉంది.







# సముద్రంలో బోటు బోల్తా

* వేటకు వెళ్లిన దేవునల్తాడకు చెందిన ఐదుగురు మత్స్యకారులు * ఒకరు మృతి, సురక్షితంగా నలుగురు

**పలాస/వజ్రపుకొత్తూరు, జనవరి6(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో విషాదం చోటు చేసుకుంది. దేవునల్తాడకు చెందిన చెక్క గోపాలరావు (40) మరో నలుగురు తోటి మత్స్యకారులతో కలిసి మంగళవారం వేకువజామున ఇంజన్ బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. అలల తాకిడికి గురై బోటు బోల్తా పడింది. నలుగురు మత్స్యకారులు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. బోటు తగిలి గోపాలరావు మృతి చెందాడు. అతడిని కూడా మత్స్యకారులు ఒడ్డుకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



మృతుడి కుటుంబానికి ప్రభుత్వ ఆదుకోవాలని మత్స్యకార నాయకులు గోవిందు, పాపారావు కోరారు. టీడీపీ నాయకులు అప్పోజి, ఆ గ్రామ సర్పంచ్ వరదరాజు, ఎంపీటీసీ వెంకన్న, మాజీ సర్పంచ్ చిరంజీవి, గ్రామ పెద్దలు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు.


### మత్స్యకారుని కుటుంబానికి రూ.10 లక్షల సాయం

దేవునల్తాడ గ్రామానికి చెందిన మత్స్యకారుడు గోపాలరావు ప్రమాదవశాత్తు చేపల వేటకు వెళ్లి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో మృతుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ పరిహారంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు, లేబర్ డిపార్ట్మెంట్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# డీలర్లు.. నిబంధనలు పాటించండి

* రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు * పలు రేషన్ డిపోల తనిఖీ * అదనపు వస్తువులు విక్రయంలో విఫలంపై ఆగ్రహం * నోటీసు బోర్డులో ధరల వివరాలు లేకపోవడంపై అసహనం

**శ్రీకాకుళం, జనవరి6(వార్త):** ప్రభుత్వం పేద ప్రజల కోసం వేలాది కోట్లు వెచ్చించి అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థలో అలసత్వాన్ని సహించేది లేదని, రేషన్ డీలర్లు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని పలు రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా బలగా హాస్పిటల్ రోడ్డులోని డిపోను పరిశీలించారు. అక్కడ స్టాక్ ఉన్నప్పటికీ అదనపు వస్తువులైన గోధుమపిండి, బెల్లం విక్రయించకపోవడంపై డీలర్‌పై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా సరఫరా అధికారిని ఆదేశించారు. అనంతరం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న డిపోలను సందర్శించారు. నోటీసు బోర్డులో వివరాలు లేకపోవడాన్ని గమనించి మండిపడ్డారు. న్యూ కాలనీలోని డిపో మూసివేసివుండడాన్ని గమనించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సదరు డీలర్‌పై చర్యలకు ఆదేశించారు. శ్రీకాకుళం అర్బన్ పరిధిలోని గాజులవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన, అక్కడ స్టాక్ రిజిస్టర్‌లను నిశితంగా పరిశీలించారు. హాజరు పట్టికలో గైర్హాజరైన వారిని రెడ్ మార్క్‌తో గుర్తించాలని, రికార్డుల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పీఎస్ఎన్ఎం పాఠశాలను సందర్శించి అక్షయపాత్ర మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే పెద్దపాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను, ఎచ్చర్లలోని గురుకుల పాఠశాల, కుప్పిలి ఏపీ మోడల్



స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా సరఫరా అధికారి, ఐసిడిఎస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఏపీలో క్రీడల అభివృద్ధికి సహకరించండి

* కేంద్ర క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయను కోరిన మంత్రి రామ్మోహన్

**శ్రీకాకుళం, జనవరి6(వార్త):** ఏపీలో క్రీడల అభివృద్ధికి తోడ్పాడు అందించాలనికేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనతో భేటి అయ్యారు. ఆంధ్రప్రదేశ్ లో పలు ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధి, మైదానాలు, క్రీడాకారుల వసతులు, క్రీడాకారులకు అందాల్సిన గౌరవాలకు సంబంధించి ప్రత్యేకంగా చర్చించారు. శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రుని వలస రెవెన్యు పరిధిలో ఉన్న 33 ఎకరాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధిపై మాట్లాడారు. ఖేలో ఇండియా పథకం నుంచి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు.

## క్రైం వార్తలు

### టెక్కలిపాడు సర్పంచ్‌పై టీడీపీ వర్గీయుల దాడి

* సర్పంచ్‌ను నరసన్నపేట ఆసుపత్రికి తరలించిన స్థానికులు * కేసు నమోదు చేసిన జలుమూరు పోలీసులు * పరామర్శించిన వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్



**జలుమూరు, జనవరి 6 (వార్త):** టెక్కలిపాడు పంచాయతీ సర్పంచ్ ధర్మాన బువ్వాజిపై మంగళవారం సాయంత్రం టీడీపీ వర్గీయుల దాడికి పాల్పడ్డారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను సర్పంచ్ దగ్గ రుండి చేయిస్తున్న సమయంలో టీడీపీ కార్యకర్త అసిరినాయుడు మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి దాడి చేసి గాయపరిచారు. సర్పంచ్‌ను స్థానికులు నరసన్నపేట ఏరియా సుపత్రికి తర లించారు. ఎస్ఐ అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సర్పంచ్‌పై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి చేరుకుని సర్పంచ్ బువ్వాజీని పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించే ఏర్పాట్లు చేయించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణ దాస్ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న నరసన్నపేట నియోజకవర్గంలో ఇలాంటి దాడులు దురదృష్టకరమన్నారు. రాజకీయ విభేదాల పేరుతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం సరికాదని తెలిపారు. దీనిపై ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లామని, దాడి చేసినవారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

### వైసీపీ ఇచ్ఛాపురం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా శ్యాం ప్రసాద్‌రెడ్డి



**ఇచ్ఛాపురం, జనవరి 6 (వార్త):** వైసీపీ ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా సాది శ్యాంప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం వైఎస్ జగన్మోహనరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా పిరియా సాయిరాజ్‌ను నియమించారు. శ్రీకాకుళం పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా తమ్మినేని సీతారాం కొనసాగనున్నారని పార్టీ అధ్యక్షులు ప్రకటించారు. అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా శ్యాం ప్రసాద్‌రెడ్డి నియామకం పట్ల నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి : ఎస్ఐ సందీప్



**జి.సిగడాం, జనవరి 6(వార్త):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడి పందాలు, జూద క్రీడలు వంటి అక్రమ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన జి.సిగడాంలో విలేఖరులతో మాట్లాడారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ప్రత్యేక నిఘా పెట్టామని పేర్కొన్నారు. అలాగే అక్రమ కోడి పందాల, జూధం నిర్వహణపై నిఘా పెంచి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి పందాలు, జూదం, గుండుగుల్ల ఆటలు వంటి అక్రమ కార్యకలాపాలు నిషేధమని తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా పలు ప్రాంతాలలో హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్రమ క్రీడలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు సంప్రదాయ పండుగలను శాంతియుతంగా, చట్టబద్ధంగా జరుపుకోవాలని, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## బస్సులను సరైన పద్ధతిలో నిర్వహించాలి



**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** రోడ్ భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం-1 డిపో గ్యారేజ్ ఆవరణలో జిల్లా ప్రజారవాణా అధికారి అప్పలనారాయణ అధ్యక్షతన, శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ అమరసింహుడు సమక్షంలో గ్యారేజ్ మెకానిక్ సిబ్బందితో మీటింగ్ నిర్వహించారు. బస్సుల లోపాలను సరి చేశారు. గ్యారేజ్ సిబ్బంది అందరూ బస్సులను సరైన పద్ధతిలో నిర్వహించి, మార్గ మధ్యంలో ఎటువంటి ఫెయిల్యూర్ కాకుండా మంచి కండిషన్‌లో ఉన్న బస్సులను డ్రైవర్లకు అందజేశారు. కార్యక్రమంలో అశోక్ లేలాండ్ ఇంజినీర్ వడివేలు, గ్యారేజ్ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలి



**జి.సిగడాం, జనవరి 6(వార్త):** పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలో సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ ఈశ్వరమ్మ ఆద్వర్యంలో పంచాయతీ కార్యదర్శి తులసీ ప్రసాద్ పర్యవేక్షణలో అన్ని వీధుల్లో పండగ వాతావరణంలో పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి సాహు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలిపారు. వర్షం నీటిని ఒడిసి పట్టుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం త్రాగు నీటి వాటర్ ట్యాంకులు, బోర్లు, బావుల్లో బ్లీచింగ్ చల్లారు,క్లోరినేషన్ మరియు దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ నిర్వహించారు.

## టీడీపీ సీనియర్ నేత ప్రకాశ్ పాణిగ్రాహి మృతి



**మందస, జనవరి 6(వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ప్రకాశ్ చంద్రపాణిగ్రాహి ఆకస్మికంగా మరణించారు. ఛాతిలో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను పలాసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో ప్రకాశ్ పాణిగ్రాహి మృతి చెందారు. సర్దార్ గౌతు లచ్చన్నకు అనుచరునిగా, మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీకి ముఖ్య అనుచరునిగా ఆయన పని చేశారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, విజయంలో పాణిగ్రాహి కీలకంగా వ్యవహరించేవారు. గౌతు కుటుంబానికి విధేయునిగా.. అంకిత భావం కలిగిన నాయకునిగా ఆయనకు గుర్తింపు ఉంది. ప్రకాశ్ చంద్రపాణిగ్రాహి మృతదేహాన్ని మందస తీసుకువచ్చి, అంత్యక్రియలు నిర్వహించారు. ప్రకాశ్ చంద్ర పాణిగ్రాహి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

## విధులపై అలసత్వం వహిస్తే.. చర్యలు తప్పవు



**జి.సిగడాం, జనవరి 6(వార్త):** ఉద్యోగ నిర్వహణలో విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు హెచ్చరించారు. మంగళవారం చంద్రపేట గ్రామం పారిశుధ్య పనులు పరిసరాలను, వెలగాడ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలను సమస్యల రహితంగా తయారు చేయాలని అన్నారు.సచివాలయ ఉద్యోగులు ప్రతీ రోజు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షమ పథకాలు అర్హులకు అందించేలా చూడాలన్నారు. సచివాలయ సేవలు ప్రజలకు చేరువచేయాలని అన్నారు. అనంతరం సచివాలయాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు.

## చిన్ననాటి మిత్రుడికి ఆర్థిక సహాయం

**సోంపేట, జనవరి 6(వార్త):** సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి స్నేహితుల్లో ఒకరైన దున్న లక్ష్మణరావు భార్య అరుణ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. గత పది ఏళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న భార్య కోసం మిత్రుడు లక్ష్మణరావు పెద్ద మొత్తంలో అప్పులు చేసి ఖర్చు పెట్టాడు. అయినా సరే భార్య లేకుండా పోయింది. లక్ష్మణరావుకు ఆరు సంవత్సరాల వయసు గల అమ్మాయి కూడా ఉంది. 15 ఏళ్ల క్రితం పరిస్థితులు అనుకూలించక పొత్తంగి గ్రామానికి వెళ్లి స్థిరపడ్డాడు. లక్ష్మణరావు కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న తోటి మిత్రులు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి పరామర్శించి 65 వేల రూపాయల నగదును సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రబృందం అధ్యక్షుడు ఏపరి రవికుమార్, ప్రవీణ్, సూరి, సాయి, జోగారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ఎంత కష్టం..ఎంత నష్టం!

- పొలాల్లో ధాన్యాన్ని ధ్వంసం చేస్తున్న అడవి పందులు
- దిగులు పడుతున్న రైతన్నలు



**సోంపేట, జనవరి 6(వార్త):** ఆరుగాలం శ్రమించి పండించిన పంట సకాలంలో అమ్ముకోలేక పొలాల్లోనే బస్తాల్లో నిల్వ ఉంచి అడవిపందుల పాలవుతున్న దుస్థితిపై బాధిత రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. ముఖ్యంగా సోంపేట మండలం బీల ప్రాంతమైన జింకిభద్ర, బెంకిలి, బారువపేట తదితర గ్రామాల్లో పందుల విధ్వంసం రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ఖరీఫ్ వరి సాగులో ఏడాది అధిక వర్షాలతో అష్ట కష్టాలు పడి పండించిన పంటకు అమ్ముకుందామంటే అతిగతి లేని పరిస్థితి నెలకొంది. రైస్ మిల్లుల్లో బ్యాంకు గ్యారంటీ లేవంటూ ధాన్యం తీసుకోకపోవడంతో రోజులపాటు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలను పొలాల్లోనే వదులుకోవాల్సి వస్తుంది. పొలాల్లో ధాన్యం బస్తాలు ఎంత జాగ్రత్తగా భద్రపరిచినా.. రాత్రి వేళల్లో అడవి పందులు బస్తాల పై దాడి చేసి బీభత్సం సృష్టిస్తున్నాయి. చిందరవందరుగా బస్తాలను చించేసి ధాన్యాన్ని చెల్లాచెదురు చేయడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఒకవైపు బిల్లుల యజమానులు ధాన్యం కొనుగోలు విషయంలో అధిక మొత్తంలో ధాన్యం దోపిడీ చేస్తుండగా మరోవైపు ప్రకృతి రైతులపై కక్ష కట్టినట్లు తీవ్రంగా నష్టపరచడంతో రైతు నడ్డి విరిగిపోతోంది. గిట్టుబాటు లేని వ్యవసాయంతో ఏదోలా నెట్టుకు వస్తున్న రైతాంగానికి ఇలా గోడ దెబ్బ .. చెంపదెబ్బల నష్టాలకు గురవడం మరింతగా కృంగదీస్తోంది. ఆదివారం రాత్రి బెంకిలి గ్రామ పొలాల్లో పోకల హేమరాజు అనే రైతు నిల్వచేసిన ధాన్యం బస్తాలను అడవిపందుల ధ్వంసం చేయడంతో ఆ రైతు కుటుంబం పడుతున్న వేదన అంతా..ఇంతా కాదు.

ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ పంటలపై ఇష్టా రాజ్యంగా దాడి చేస్తున్న అడవిపందులతో పాటు ఇతర అడవి జంతువుల నివా రణ గూర్చి ప్రభుత్వాలకు పట్టకపోవడం గమనార్హం. దీనిపై రైతాంగం నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

# సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- శిక్షణా తరగతుల్లో టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే రవికుమార్ దిశానిర్దేశం



**ఆమదాలవలస, జనవరి 6(వార్త):** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా జనరల్ సెక్రటరీల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పి.యూ.సి చైర్మన్ కూన రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రజలకు అందేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, వాటిని ప్రజలకు వివరించగలిగే విధంగా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా క్రమశిక్షణతో పనిచేస్తే రానున్న కాలంలో మరింత ప్రజాభిమానం పొందగలమని తెలిపారు.

# ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన



**మెళియాపుట్టి జనవరి 6(వార్త):** వ్యవసాయ సాగులో ఎరువులు వినియోగంపై రైతులు అవలంబించవలసిన, అవలంబిస్తున్న విధానాలపై వ్యవసాయ అధికారి ఎస్. దానకర్ణుడు నేతృత్వంలో పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మెళియాపుట్టి మండలం కోసమాల, వసుంధర గ్రామాలలో వ్యవసాయధికారి దానకర్ణుడు నేతృత్వంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయధికారి దానకర్ణుడు రైతులతో మాట్లాడుతూ క్షత్రస్థాయిలో పంటలను పరిశీలన చేసి రైతులకు యాజమాన్య పద్ధతుల పైన తగిన సలహాలు, సూచనలు అందజేశారు. కత్తెర పురుగు ఆశించిన పంట పొలాలకు వేపనూనె ఒక లీటరు యమామెట్టిన్ బెంజోయేట్ 100 గ్రాములకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని, వివిధ ఎరువులు యాజమాన్య వినియోగం, రబీలో పండించే మినుము, పెసర, వరి, నువ్వులు తదితర పంటల పైన అవగాహన కల్పించారు. ఎరువులు కావలసిన రైతులు స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకుల్ని లేదా మండల వ్యవసాయధికారిని సంప్రదించి ఎరువులను పొందవచ్చున్నారు. ఈ పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయధికారి తోపాటు కూటమి నాయకులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే



**జి.సిగడాం, జనవరి 6(వార్త):** ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో జి.రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం జగన్నాథవలసలో పంచాయతీ కార్యదర్శి మజ్జి ధనలక్ష్మ ఆధ్యర్యంలో ఆమెతో పాటు సచివాలయ సిబ్బంది ముమ్మరంగా యూనీఫైడ్ ప్యామలీ సర్వేను ( ఏకీకృత)ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకొని ప్రభుత్వ రికార్డ్ యాప్ లో ఖచ్చితంగా నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రభుత్వ రికార్డుల్లో ప్రతి కుటుంబం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా, అర్హత ఉండి కూడా పథకాలకు దూరమైన వారిని గుర్తించడం ఈ సర్వే ప్రధాన లక్ష్యమని. దీనివల్ల పౌర సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయన్నారు.ఒకసారి డేటా అప్‌డేట్ అయితే, కుల, ఆదాయ లేదా ఇతర ప్రభుత్వ ధృవపత్రాల కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు మరియు ఇతర పథకాలు నేరుగా అందుతాయని తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత ప్రోత్సాహం

**నరసన్నపేట, జనవరి 6(వార్త):** అరుదైన వంగడాలతో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. దేవాదిలో మాకివలస గ్రామానికి చెందిన జరుగుల్ల కమల ఏర్పాటు చేసిన ఐసీఆర్పీ ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఆయన నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చనతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా పండిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఇలాంటి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు ప్రతి కుటుంబానికి అందుబాటులోకి రావాలంటే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు మార్కెట్ అవకాశాలు పెరగడం ద్వారా ఆదాయం కూడా మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల సంక్షేమంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, యూనిట్ ఇన్ చార్జిలు యాళ్ల వేణుగోపాలరావు, శిమ్మ జగన్నాథం, నీటి సంఘం అధ్యక్షుడు ముద్దాడ అప్పల నాయుడు, కింజరాపు సూర్యనారాయణ, ధర్మాన అసిరినాయుడు, దుంగ గంగరాజు, గొండు సూర్యరావు, రఘునాధరావు, బాయిరెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భవనాలకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం




**పలాస, జనవరి 6(వార్త):** కేదారిపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబు రావు, గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, ఏఎంసీ మల్ల శ్రీనివాస్, వంకల కూర్మారావు, సంతోష్, గంగారం, దశరథ, విష్ణు, పాడి ధనుంజయ, పాడి గణేష్, పాడినారాయణ, ఎంపీడీవో వసంత్‌కుమార్, డీఈ రవి, ఆయా సంస్థల అధికా రులు, సిబ్బంది, గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతోనే కేసుల రాజీ



**పలాస, జనవరి 6(వార్త):** కేసులు పరిష్కారానికి మధ్యవర్తిత్వం చాలా అవసరమని మండల్ లీగల్ సెల్ సర్వీస్ అథరిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి తెలియజేశారు. ఇటీవల మీడియేషన్ అడ్వకేట్స్‌గా సుప్రీంకోర్టుకు చెందిన ప్రత్యేక ప్రతినిధుల ద్వారా శిక్షణ పొందిన పలాస బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జిఎంఎస్. అనిల్ రాజుకు ఏపీ లీగల్ సెల్ సర్వీస్ అథరిటీ, అమరావతి జారీచేసిన జారీచేసిన సర్టిఫికెట్ను మంగళవారం పలాస జూనియర్ సివిల్ జడ్జి యూ మాధురి అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ కుటుంబ పరమైన కేసులు, ఆస్తి తగాదాలు, చెక్ బౌన్స్, మనీ సూట్స్ తదితర కేసులు మధ్య వర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా అనిల్ రాజును అభినందించారు. తోటి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

## మొదలవలస రమేష్‌తో నిరంజ భేటీ



**పలాస, జనవరి 6(వార్త):** తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్ తో మర్యాదపూర్వకంగా నీటి సంఘం అధ్యక్షులు గుణప నిరంజ మంగళవారం భేటీ అయ్యారు. మొదలవలస రమేష్ శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన సుభసందర్భంగా పలాస ఎమ్మెల్యే పార్టీ ఆఫీస్ లో పార్టీ పెద్దలు, నీటి సంఘాల అధ్యక్షులు కలిసి ఘనంగా సన్మానం చేశారు. పార్టీ అభివృద్ధికి సైనికుల పని చేయాలని జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

## తాగునీరు, డ్రైనేజీ లేని కృష్ణానగర్

- మౌలిక వసతుల కోసం కాలనీవాసుల ఆవేదన

**నరసన్నపేట, జనవరి 6(వార్త):** కృష్ణానగర్‌లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా తాగునీటి సదుపాయం లేక మహిళలు రోజూ ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం కాలనీలోని మహిళలు మాట్లాడుతూ, తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోవడం వల్ల దోమల బెడద పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కాలనీలో రోడ్లు, వీధి దీపాలు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని వారు వాపోయారు. ఇక కాలనీకి సంబంధించి స్థానిక సర్పంచ్, వార్డ్ మెంబర్ ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొందని, సమస్యలను చెప్పుకునేందుకు సరైన ప్రతినిధి లేకపోవడం తమ బాధను మరింత పెంచుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి కృష్ణానగర్‌లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## జాతీయస్థాయిలో రాణించిన కంచిలి గురుకుల విద్యార్థి



**సోంపేట, జనవరి 6(వార్త):** గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన శ్రేష్ఠ – ఎన్ఈటీఎస్ 2026 ఫలితాల్లో కంచిలి బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి పొట్నూరు ప్రవీణ్ కుమార్ సత్తా చాటాడు. పేద దళిత విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించే లక్ష్యంతో కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు నిర్వహించిన ఈ పోటీలో కంచిలి గురుకుల విద్యార్థి పదో తరగతి చదువుతున్న ప్రవీణ్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయిలో 725 ర్యాంక్ సాధించి జోన్ వన్ స్కూల్స్‌లోనే అత్యుత్తమ ర్యాంకు ప్రవీణ్ కైవసం చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన ప్రవీణ్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

# దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం

### -పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, జనవరి 6(వార్త):** దివ్యాంగుల అవసరాలను గుర్తించి సహాకారం అందించాలనే ఉద్దేశంతో వీల్ చైర్లు, వినికిడి పరికరాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తూ దివ్యంగులకు అండగా నిలిచిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం కేదారిపురం గ్రామంలో మంగళవారం దివ్యంగులకు వీల్ చైర్లు వినికిడి పరికరాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 74 లక్షలు వ్యయంతో 350 మందికి వీల్ చైర్లు వినికిడి పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. దివ్యంగుల అవసరాలు కోసం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఫలితంగానే దివ్యంగులకు పరికరాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దివ్యంగులకు పట్టించుకోలేదని, వారికి ఇటువంటి సహకారం అందించడం ద్వారా మరింత మనోధైర్యంతో ముందుకు వెళ్తారన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇవ్వడం జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా అందక పోయినా, సమాచారం అందక పోయినా ఫోన్ చేసి తప్పకుండా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో పలాస డిడిఓ, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి శైలజా, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ పి విఠల్ రావు, ఎంపిడిఓ వసంత కుమార్, మెట్ట వైకుంఠ రావు, పలాస పిఎసిఎస్ అధ్యక్షుడు వంకల కూర్మారావు, దువ్వాడ సంతోష్ కుమార్, వడ్డీ



యాదగిరి, ఆళ్ళ కృష్ణారావు, పాడి దుర్యోధన, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**పోలాకి, జనవరి 6 (వార్త):** విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్ష (మ్యాథ్స్ ఒలింపియాడ్)లో ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభను చాటారు. ఈ పరీక్షలో పాఠశాల నుంచి పాల్గొన్న 33 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. మంగళవారం పాఠశాల ప్రిన్సిపల్ పైడి ప్రవీణ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణితంలో విద్యార్థులు చూపిన ఆసక్తి, కృషి మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిలో 8 మంది విద్యార్థులు బంగారు పథకాలు, 13 మంది వెండి పథకాలు, 12 మంది కాంస్య పథకాలు సాధించినట్లు తెలిపారు. అలాగే, ఎంపికైన విద్యార్థుల కోసం రెండవ స్థాయి గణిత ప్రతిభా పరీక్షను ఈ నెల 8వ తేదీన పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రతిభ చూపాలని విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## డంపింగ్ యార్డులా ఎన్బీసీ మెయిన్ కెనాల్

### -సాగునీటి కలుషితంపై రైతుల ఆందోళన



**నరసన్నపేట, జనవరి 6(వార్త):** జమ్ము కూడలి వద్ద ఉన్న నరసన్నపేట బ్రాంచ్ _నాల్ (ఎన్బీసీ మెయిన్_నాల్) పరిసర ప్రాంతం ప్రస్తుతం డంపింగ్ యార్డును తలపిస్తోంది. కాలువ గట్లపై ఎక్కడికక్కడ చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ పరిస్థితిపై స్థానికులు, రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కాలువకు ఆనుకుని ఉన్న హోటళ్ల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, వంశధార కాలనీలో పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా రాకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే చెత్తను కాలువ గట్లపై పడేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ కారణంగా కాలువ గట్లు చెత్త కుప్పలుగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా గట్లపై పడేసిన వ్యర్థాలు వర్షాలు పడిన సమయంలో కాలువలో కలిసిపోతుండటంతో సాగునీరు కలుషితమవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటితో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి కాలువ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు, చెత్తను అక్కడ పడేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పారిశుద్ధ్య సేవలను క్రమబద్ధీకరించి, ఎన్బీసీ మెయిన్_నాల్‌ను రక్షించాలని కోరుతున్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**నరసన్నపేట, జనవరి 6(వార్త):** గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత మెరుగుపడాలని డిప్యూటీ ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం నరసన్నపేట మండలం కంబకాయ గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ప్రతిరోజూ ప్రజల నుంచి సేకరించే వ్యర్థాలను విధిగా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం చోటుచేసుకోకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలను రోజూ సమీక్షస్తూ సమర్థవంతంగా అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శి సతీష్‌కు సూచించారు. గ్రామ స్వచ్ఛతతోనే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని, అందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని రమేష్ తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకు యువత నడుంకట్టాలి



**పలాస, జనవరి 6(వార్త):** పర్యావరణ పరిరక్షణపై యువత ముందుకు రావాలని పలాస అటవీశాఖ అధికారి ఎ మురళీకృష్ణ నాయుడు అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆధ్వర్యంలో ఐదో రోజు కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పలాస గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఐదో రోజున మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలాస అటవీశాఖ అధికారి ఏ. మురళీకృష్ణ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెట్లు నాటాలని, నాటిన చెట్ల ద్వారా సమాజానికి ఆక్సిజన్ అందుతుందని తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటితే అవి క్రమంగా అడవులుగా రూపాంతరం చెందుతాయని పేర్కొన్నారు. ఆధునిక మానవుడు తన అవసరాల కోసం అధికంగా కలప వినియోగించడం వల్ల అడవుల సాంద్రత తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అడవులు ఉండటం వల్ల సుమారు 1600 రకాల పక్షులు జీవనం కొనసాగిస్తున్నాయని, ఆ పక్షులు విత్తనాలను వివిధ ప్రాంతాలకు చేరవేసి అడవుల అభివృద్ధికి దోహదపడుతున్నాయని వివరించారు. అడవుల నరికివేత కారణంగా నేడు గ్రామాల్లోకి అడవి జంతువుల సంచారం పెరుగుతోందని సూచించారు. సున్నాడ గ్రామంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. మధుతో పాటు అధ్యాపకులు శంకరరావు, వాంటిర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల ప్రచారం మానుకో జగన్ రెడ్డి

### -ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ



**పలాస, జనవరి 6(వార్త):** అబద్ధపు ప్రచారాల్లో జగన్ మించిన దిట్ట లేదు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిరోధకమైన జగన్, నేడు భోగాపురం విమానాశ్రయం పనులపై తప్పుడు ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటు అని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ నాడు ఎన్నికల ప్రచారం సమయంలో భోగాపురానికి ఎర్రబస్సు రాదు.. ఎయిర్ బస్ ఎందుకని ఎద్దేవా చేసింది మీరు కాదా జగన్ రెడ్డి అని దుయ్యబట్టారు. బహిరంగ సభలు పెట్టి, అమాయకపు రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టును అడ్డుకోవాలని, చూసింది నిజం కాదా, అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు పనులను అటకెక్కించి, ఉత్తరాంధ్ర భవిష్యత్తును అంధకారం చేసింది మీరు కాదా, నేడు మన కూటమి ప్రభుత్వంలో, భోగాపురం ఎయిర్‌పోర్ట్-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దత్తపుత్రికని వివరించారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాటిన మొక్కను, ఈ 6 నెలల్లోనే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి 95% పనులు పూర్తి చేసి విమానం ల్యాండ్ అయ్యే స్థాయికి తెచ్చామని, గుర్తుంచుకో జగన్ అని అన్నారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన నాటి నుండి నేటి చంద్రబాబు వరకు.. ఉత్తరాంధ్రకు గౌరవం, సాగునీరు, పరిశ్రమలు ఇచ్చింది కేవలం తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు. అభివృద్ధిని అడ్డుకున్న వారెవరో, ఈ ప్రాంత రూపురేఖలు మారుస్తున్న వారెవరో ఉత్తరాంధ్ర ప్రజలకు అన్నీ తెలుసని, మీ ఫేక్ రాజకీయాలు ఇక్కడ సాగవని తీవ్రంగా మండిపడ్డారు. జగన్ రెడ్డి గతంలో మీరు చెప్పిన మాటలు కూడా వీడియోలు మీ ముందు పెడుతున్నా మని ప్రజలు గమనించాలని కోరారు.

# ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో హబీబ్‌కి మద్దతు



**పలాస, జనవరి 6(వార్త):** ఫిబ్రవరి నెలలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో అడ్వకేట్ హబీబ్ సుల్తాన్ అలీ సభ్యుడిగా పోటీ చేస్తున్న మా మద్దతుని పలాస న్యాయవాదులు తెలిపారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం న్యాయవాదుల మద్దతును కోరారు. న్యాయవాద వృత్తిలో విశేషా అనుభవం ఉన్న ఆయన విశాఖపట్నం బార్ అసోసియేషన్ సభ్యుడిగా సుదీర్ఘ అనుభవం ఉండి, హైకోర్టులో మంచి న్యాయవాదిగా గుర్తింపు పొందారు. అంతే కాకుండా ఆశ్రా (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఎవేర్నెస్) వ్యవస్థాప అధ్యక్షుడిగా పనిచేస్తూ మూడు వేల పైగా కేసులకు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం చేశారు. సుల్తాన్ హబీబ్ హబీబ్ సుల్తాన్ అలీ సేవకు మద్దతుగా పలువురు న్యాయవాదులు ఇప్పటికే బార్ అసోసియేషన్ ఎన్నికలు లోఅయన కు మద్దత్తు ప్రకటించారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులను కలిసి తమ గెలుపుకు సహకరించవలసిందిగా హబీబ్ సుల్తాన్ అలీ కోరారు.

## పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి




**నరసన్నపేట, జనవరి 6(వార్త):** జిల్లాలో పశువుల అక్రమ రవాణా అధికంగా జరుగుతుండటంపై భజరంగదళ్ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా నరసన్నపేట మీదుగా వెళ్లే వాహనాలపై కఠిన తనిఖీలు చేపట్టాలని జిల్లా భజరంగదళ్ కన్వీనర్ కిరణ్ కుమార్ పోలీసులను కోరారు. ఈ మేరకు మంగళవారం నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కే. శేఖర్ రావుకు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ నరసన్నపేట ప్రధాన రహదారిలో పశువుల అక్రమ రవాణా నిర్బంధం లేకుండా కొనసాగుతోందని తెలిపారు. ఈ అక్రమ కార్యకలాపాల వల్ల ప్రజల్లో ఆందోళన నెలకొంటోందని, పశు సంక్షమంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాలపై నిరంతర తనిఖీలు, గస్తీ పెంపు, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఎస్సై కే. శేఖర్ రావు, పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని, ఇకపై మరింత కఠినంగా పర్యవేక్షణ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ఘటనతో జిల్లాలో పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు అవసరమనే అంశం మరోసారి ప్రాధాన్యతను సంతరించుకుంది.

## టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం నమోదు వేగవంతం చేయాలి: ఎంఈఓలు



**నరసన్నపేట, జనవరి 6(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సూచించారు. మంగళవారం నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయంలో కొనసాగుతున్న నమోదు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 12,080 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, నేటి వరకు 7,818 మంది ఉపాధ్యాయులు మాత్రమే టీఐఎస్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన ఉపాధ్యాయులు కూడా త్వరితగతిన నమోదు పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యాశాఖ నిర్దేశించిన గడువు ప్రకారం ఈ నెల తొమ్మిదో తేదీలోగా శతశాతం నమోదు పూర్తి కావాలని స్పష్టం చేశారు. నమోదు ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పాస్ పుస్తకాల్లో లోపాలుంటే తెలపండి



**నరసన్నపేట, జనవరి 6(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాదారు పాస్ పుస్తకాలను రాజముద్రతో రైతులకు అందజేస్తున్నట్లు నరసన్నపేట తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం చిక్కాలవలస రెవెన్యూ గ్రామంలో రైతులకు పాస్‌పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. సుందరాపురం, కుద్దాం, మామిడివలస గ్రామాల్లో కలిపి సుమారు వెయ్యి పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. రైతులు తమకు అందిన పాస్‌పుస్తకాలను జాగ్రత్తగా పరిశీలించాలని, భూమి వివరాలు, సర్వే నంబర్లు, విస్తీర్ణం తదితరాల్లో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల భూమి హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆయన, తప్పుల సవరణకు తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 112తో పోలీస్ సహాయంపై అవగాహన




**పోలాకి, జనవరి 6 (వార్త):** ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం శక్తి టీంఉ4 ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ చట్టాలు, మహిళా భద్రత, బాలల హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా టోల్ ఫ్రీ నెంబర్ 112కి కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందవచ్చని టీం సభ్యులు వివరించారు. శక్తి యాప్ వినియోగ విధానం, దాని ద్వారా లభించే భద్రతా సదుపాయాలను విద్యార్థులకు స్పష్టంగా తెలియజేశారు. అలాగే పోక్సో చట్టం గురించి, చిన్నారులపై జరిగే నేరాల నివారణకు చట్టం కల్పించే రక్షణలు, శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు గిరిధర్, శ్రీనివాసరావు పాల్గొనగా, కళాశాల ప్రిన్సిపల్ జగదీష్ విద్యార్థులను చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భద్రతపై చైతన్యం పెంచడంలో కీలకంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## గోదాముల సమస్యలపై మంత్రికి వినతి

**నరసన్నపేట, జనవరి 6(వార్త):** నరసన్నపేట పరిధిలోని ఎస్‌డబ్ల్యూడీసీ గోదాముల సమస్యలపై నరసన్నపేట జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బలగ ప్రవీణ్ కుమార్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి వినతి పత్రాన్ని సమర్పించారు. భోగాపురం సన్ రే రిసార్ట్‌లో మంత్రిని కలిసి ఈ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన 5,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల పాత రాఔణజ గోదామును పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని కోరారు. గోదాములో ఏర్పాటు చేసిన ప్యాకింగ్ మెషినరీ అధిక స్థలాన్ని ఆక్రమించడం వల్ల సుమారు 2,000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం వినియోగానికి రాకుండా పోతున్న విషయాన్ని వివరించారు. దీనివల్ల ప్రభుత్వ ధాన్య నిల్వలు మరియు సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, గోదాముల్లో కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 81 మంది హమాలీలు (కూలీలు)కు ఈఎస్ఐ (ఉద్యోగుల రాష్ట్ర బీమా) సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు. కార్మికుల సంక్షేమం దృష్ట్యా ఈ సౌకర్యం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ వినతిపై మంత్రి నాదెండ్ల మనోహర్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# కార్యకర్తలే పార్టీకి పునాదులు

### -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
### -పోలాకి మండలంలో ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాల అందజేత



**పోలాకి, జనవరి 6 (వార్త):** కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉత్తమ కార్యకర్తలకు చిరు సన్మానాలు, ప్రశంసా పత్రాల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొని కార్యకర్తలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాదులని స్పష్టం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీస్కుళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. కష్టపడి, చురుకుగా పనిచేసే కార్యకర్తలకు పార్టీ తరపున ఎప్పుడూ తగిన ప్రోత్సాహం ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో నాయకులు, కార్యకర్తలు పోటీపడాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ కొనసాగాలని సూచిస్తూ క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలతో పాటు పలువురు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలోనే ప్రజారంజక పాలన అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు. ఇదే ఉత్సాహంతో అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**పలాస, జనవరి 6(వార్త):** పలాస నియోజకవర్గం పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామంనకు చెందిన వైశ్యరాజు మణికంఠ అను వ్యక్తి ఈ మధ్య కాలంలో ప్రమాదవ శాత్తు ఎక్సిడెంట్ కు గురైన విషయం బ్రాహ్మణతర్ల కూటమి నాయకులు ద్వారా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టి తీసుకువచ్చారు. పలాస ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఆయనకు ముఖ్య మంత్రి సహాయ నిధికు తెలియజేసి అతని యొక్క కుటుంబ సభ్యులుకు ముఖ్య మంత్రి సహాయ నిది ద్వారా 190680.00రూపాయలు విలువ గల చెక్కును పలాస ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గౌతు శిరీష చేతులు మీదుగా అందజేశారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి యువత తోడ్పడాలి




**పలాస, జనవరి 6 (వార్త):** రాష్ట్ర, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆదేశాలపై పలాస మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి యు. మాధురి సూచనలపై మంగళవారం శ్రీ బాల శివ యోగింద్ర మహారాజ్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఐదు జనవరి నుండి 12 జనవరి వరకు స్వామి వివేకానంద వారి జయంతి ఉత్సవాలలో భాగంగా జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా యువత యొక్క అభివృద్ధి డ్రగ్స్ నిరోధము అంశాలపై ఈ న్యాయవిజ్ఞాన సదస్సు మండల న్యాయ సేవా సంఘం పలాస వారి ద్వారా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పలాస న్యాయవాదుల సంఘం జాయింట్ సెక్రటరి జి. ఎం. ఎస్ అనిల్ రాజు, న్యాయవాది డాక్టర్. లోకేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రవీణ కుమారి, అధ్యాపకులు పాల్గొని, విద్యార్థిని-విద్యార్థులు కు అవగాహన కల్పించారు. యువత ఉన్నత విద్యలను అభ్యసించి మంచి మార్గంలో వారి జీవితాలను తీర్చిదిద్దుకోవాలని స్వామి వివేకానంద జీవితమే యువతకు మార్గదర్శకమని, వ్యసనములు లేకుండా ఉంటే దేశ అభివృద్ధికి మూల స్తంభాలని, వ్యసనాలు, మత్తు పదార్థాలు లేదా మాదక ద్రవ్యాల బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలని, అపరిచితుల ద్వారా ఇటువంటి మాదక ద్రవ్యాలు లేదా మత్తు పదార్థాలు ద్వారా యువత వారి యొక్క భవిష్యత్తును కోల్పోతున్నారని తెలియజేశారు. డ్రగ్స్ వద్దు - ఆరోగ్యం ముద్దు, యువతే దేశానికి భవిత అనీ వక్తలు తెలిపారు. మత్తు వదిలితే జీవితం లో విజయవంతం అవుతారని, ఈ మాదకద్రవ్య వినియోగము లేదా ఇటువంటి చెడు అలవాట్లు, మాదక ద్రవ్యాలను కలిగి ఉండడం కూడా నేరమని దానికి తీవ్రమైన జైలు శిక్షలు జరిమానాలు ఉన్నాయని, విద్యార్థిని -విద్యార్థులు చక్కగా వారి జీవితాన్ని ఉన్నత విద్యను అభ్యసించి, క్రమశిక్షణను అలవాటు చేసుకుని తద్వారా వారి జీవితాలలో ఉన్నత శిఖరాలను పొందాలని వక్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, అధిక సంఖ్య లో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాన్యులకు న్యాయ సేవలు అందించడమే లక్ష్యం



**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** పేదలకు, అట్టడుగు వర్గాలకు న్యాయమైన న్యాయ సేవలు అందించడంలో ప్యానల్ న్యాయవాదుల పాత్ర కీలకమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానల్ న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు తమ విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని, న్యాయం కోసం ఆశ్రయించిన వారికి నాణ్యమైన సేవలు అందించాలని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. న్యాయ సేవా సంస్థ ద్వారా వచ్చే కేసులను అత్యంత శ్రద్ధతో, జాగ్రత్తతో స్వీకరించాలన్నారు. కేసులు అనవసరంగా ఆలస్యం కాకుండా చూడాలని, ఒకవేళ ఏదైనా కేసు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉంటే ఆ విషయాన్ని వెంటనే సంబంధిత కోర్టు దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి కేసులోనూ బాధితులకు న్యాయం చేకూరడమే పరమావధిగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్యానల్ న్యాయవాదులు, మధ్యవర్తులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో భోజనం నాణ్యతపై రాజీ పడొద్దు

వసతి గృహాల్లో నివసించే విద్యార్థినుల భద్రత, రక్షణ, ఆరోగ్య విషయాల్లో ఎటువంటి రాజీ పడకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మిల్లు కూడలి వద్ద గల ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, ఆరోగ్యం, యోగక్షమాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని నివాస పరిస్థితులను పరిశీలించిన ఆయన, విద్యార్థినులకు అందుతున్న ఆహార నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే భయం లేకుండా అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఉచిత న్యాయ సేవలు పొందేందుకు న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చని తెలిపారు. విద్యార్థి దశ నుంచే తమ హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను వినియోగించుకుని విద్యాపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షంచారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, వసతి గృహ పర్యవేక్షకురాలు ఎస్. ప్రమీల రాణి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై విద్యార్థుల వీరంగం



**సంతబొమ్మాళి, జనవరి 7(వార్త):** నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం మెయిన్ రోడ్డుపై వీరంగం సృష్టించారు. బస్టాండ్ ఎదురుగా నడిరోడ్డుపై గుంపులుగా ఒకరికొకరు దాడులు చేసుకోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విద్యార్థులలో ఎక్కడ ఏ గొడవ తలెత్తిందో తెలియదు గానీ నడిరోడ్డుపై రౌడీమూకల గుంపులుగా సినిమా మాదిరి దాడులు చేసుకోవడంతో చూస్తున్న స్థానికులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కొంతమంది స్థానికులు జోక్యం చేసుకున్నప్పటికీ విద్యార్థులు శాంతించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల జోక్యంతో విద్యార్థులు చల్లాచెదురయ్యారు. ప్రతిరోజు కళాశాల విడిచిపెట్టే సమయానికి కొంతమంది ఆకతాయిలు బైకులపై త్రిబుల్ రేష్ రైడింగ్ లతో ప్రజలకు భయాందోళన కలిగిస్తున్నారని సార్వత్రిక విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరగక ముందే పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### సిక్కోలు 'రథసప్తమి'..
# వైభవంగా నిర్వహిద్దాం

- 9న ఉదయం 8 గంటలకు 'కర్టెన్ రైజర్'తో శ్రీకారం
- ఉత్సవాల నిర్వహణకు 15 కమిటీలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 19 నుంచి 25 వరకు జరిగే రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటలకు కర్టెన్ రైజర్ల కార్యక్రమంతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థలలో విద్యార్థులు సూర్యనమస్కారాలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాల బ్రాండింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆలయ ప్రాశస్త్యం తెలిసేలా పెద్ద సైజు ఫ్లెక్సీలు, పుష్పాలతో అలంకరణలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా రూ.100 క్యూ లైన్లు, ఉచిత దర్శనం లైన్లలో వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్లకు పార్కింగ్ నుంచి ఆలయం వరకు రవాణా సౌకర్యం కల్పించాలని, ఇందుకోసం పోలీసు శాఖ సమన్వయంతో పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయాలని సూచించారు. గతంలో విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి భోజన సదుపాయం అందలేదన్న ఫిర్యాదులు మళ్లీ రాకూడదని, ఫుడ్ కమిటీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. సిక్కోలు రథసప్తమి జ్ఞాపికలు, పొందూరు ఖాదీ శాలువాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల విజయవంతం కోసం కలెక్టర్ 15 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో ఫండింగ్ కమిటీ, ఆహ్వాన పత్రికల కమిటీ, పబ్లిసిటీ కమిటీ వంటి కీలక బృందాలను నియమించారు. వీటితో పాటు శోభాయాత్ర, మెగా సూర్యనమస్కార్, సాంస్కృతిక కార్యక్రమాలు, పార్కింగ్, బ్యూటిఫికేషన్ కమిటీలు క్షేత్రస్థాయిలో పనిచేస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎస్వీ లక్ష్మణమూర్తి, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, ఆలయ ఈఓ, మున్సిపల్ కమిషనర్, వైద్య ఆరోగ్య శాఖ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జవాబుదారీతనంతో పనిచేయండి

- వైద్యులు, సిబ్బంది తీరుపై కలెక్టర్ సీరియస్

**శ్రీకాకుళం, జనవరి 6 (వార్త):** ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పడితే సహించేది లేదని, విధుల్లో బాధ్యతారాహిత్యం ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలకు సేవ చేయాల్సిన వారు మెయింటైన్ చేయాల్సిన రిజిస్టర్ల దగ్గర నుంచి బయోమెట్రిక్ వరకు అన్నీ సక్రమంగా ఉండాల్సిందేనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. చాలా మంది మెడికల్ ఆఫీసర్లు బాధ్యతగా వ్యవహరించడం లేదని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు వారం రోజుల్లోగా జిల్లాలోని 71 పీహెచ్‌సీలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. సిబ్బందికి సంబంధించి మూమెంట్, లీవ్ రిజిస్టర్లు సరిగ్గా లేవని, ఈ విషయంలో ఉపేక్షించేది లేదన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న 6,400 మంది సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. 3-టైర్ వ్యవస్థలో బయోమెట్రిక్ హాజరును పక్కాగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సిటిజన్ ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాట్సాప్ మిత్ర ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ, అన్నా క్యాంటీన్ల నిర్వహణ ద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేలా ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. ప్రభుత్వ పరిపాలనలో ఈ-ఆఫీస్ అమలును అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇకపై ఫైళ్లన్నీ ఈ-ఆఫీస్ ద్వారానే జరగాలని, కాలయాపన చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పారిశుధ్యం మెరుగుపరచాలని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఆదాయం పెంచేలా చూడాలని సూచించారు. నివాస స్థలాల పట్టాల పంపిణీకి ఖాళీ ప్లాట్ల వివరాలు సిద్ధం చేయాలని, పంచాయతీ భవనాల నిర్మాణానికి స్థలాలు సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. అలాగే డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, డీఎంహెచ్ఓ అనిత, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, ఆర్డీఓలు సాయి ప్రత్యూష, కృష్ణ మూర్తి, వెంకటేష్, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.




# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**పలాస, జనవరి 6(వార్త):** రైతుల సంక్షమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గం అమలకుడియ గ్రామంలో జరిగిన ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పట్టాదార్ పాస్ బుక్ ల మంగళవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ అహంకారపూరిత పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షమ పాలనకు మధ్య ఉన్న తేడాను 18 నెలల పాలనలోనే చేసి చూపించామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

### వైసీపీ పభుత్వంపై విమర్శలు..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని శిరీష విమర్శించారు. పాఠ్యపుస్తకాల నుంచి చిక్కీ ప్యాట్ల వరకు ప్రతిచోటా నాయకుడి ఫోటోలు ముద్రించి, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారని ఆరోపించారు. రూ.5కే పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను మూసివేయడం, ఎన్నికల ముందు మాత్రమే పెన్షన్లు పెంచి ప్రజలను మోసం చేయడం వంటి చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. మంత్రి పదవిలో ఉండి కూడా నియోజకవర్గానికి వంశధార జలాలను తీసుకురాలేకపోయారని విమర్శించారు.

### 18 నెలల్లో కూటమి విజయాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే 90% హామీలను నెరవేర్చిందని శిరీష తెలిపారు. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేలా (రాజముద్ర)తో కూడిన శాశ్వత భూహక్కు పత్రాలను అందిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పలాస ఏఎంసి చైర్మన్ మల్ల శ్రీనివాస్, వీరఘట్లు మెట్లు, వంక కూర్మారావు సంతోష్ నాయుడు, తమ్మినేని గంగారం, దసరత్, బాలయ్య, అమలకుడి గ్రామ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# శరవేగంగా ఇండోర్ స్టేడియం పనులు



**నరసన్నపేట, జనవరి 6(వార్త):** నరసన్నపేట ఇండోర్ స్టేడియం పనులు మళ్లీ ప్రారంభమై శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ స్టేడియం పనులు 2016లో ప్రారంభమై సుమారు 60 శాతం పూర్తయినప్పటికీ, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణ యువత, క్రీడాకారులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తూ నిరాశకు గురయ్యారు.

ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నరసన్నపేట పట్టణ యువత మరియు క్రీడాకారుల కోరిక మేరకు ప్రస్తుత గౌరవ ఎమ్మెల్యే నిధుల కోసం ప్రత్యేకంగా పోరాడి ప్రభుత్వ నుంచి నిధులు కేటాయింపజేయడంతో, ఇండోర్ స్టేడియం పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇండోర్ స్టేడియం పనుల పురోగతిని పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ అభివృద్ధి మరియు సంక్షమ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడుతో పాటు మేజర్ పంచాయతీ మాజీ అధ్యక్షులు గొద్దు చిట్టిబాబు స్టేడియాన్ని సందర్శించారు. పనుల నాణ్యత, వేగంపై వారు అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఇండోర్ స్టేడియం పూర్తయితే నరసన్నపేట పట్టణంలో క్రీడలకు మరింత ప్రోత్సాహం లభించి, యువత ప్రతిభను వెలికితీయడానికి ఇది కీలకంగా మారుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్ మళ్లీ ముందుకు సాగుతుండటంతో పట్టణ ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# పెద్దబొరిగివలసలో వీబీజీ..రామ్‌జీపై గ్రామ సభ



**నరసన్నపేట, జనవరి 6(వార్త):** పెద్దబొరిగివలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీరామ్‌జీ పథకంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో గ్రామ సర్పంచ్‌తో పాటు రాష్ట్ర కూరాకుల/పొందర కార్పొరేషన్ చైర్మన్ దామోదర నరసింహులు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ, గ్రామ పెద్దలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచిన విషయాన్ని అధికారులు వివరించారు. పెరిగిన పని దినాల వల్ల గ్రామీణ ఉపాధి అవకాశాలు విస్తరించి, పేద కుటుంబాలకు స్థిర ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామాభివృద్ధి పనులు వేగవంతమవుతాయని, మౌలిక వసతుల మెరుగుదలకు తోడ్పడుతుందని చెప్పారు. గ్రామ అభివృద్ధి శాఖ ఈ పథకానికి అనుమతి మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో గ్రామస్తులు చురుకుగా పాల్గొనాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధికి ఇది కీలక ముందడుగుని నాయకులు పేర్కొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546